# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 344
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
నవంబర్ 04, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటన కర్తలకు, జర్నలిస్టు మిత్రులకు, వ్యాపారవాణిజ్యవేత్తలకు, అధికారులకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు, విద్యావేత్తలకు, సాహితీవేత్తలకు, కవులు, కళాకారులకు, మహిళామణులకు ప్రతి ఒక్కరికీ కార్తీక పౌర్ణమి పర్వదిన శుభాకాంక్షలు.. పండుగ సందర్భంగా బుధవారం కార్యాలయానికి సెలవు. పున: దర్శనం గురువారం.

- వరంగల్ వాయిస్ యాజమాన్యం

వివరాలు 2లో..




# ఎంజీఎంకు సుస్తీ



ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టు పక్కల జిల్లాల్లోని రోగులకు పెద్ద దిక్కుగా ఉన్న మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆస్పత్రికి సుస్తి చేసింది. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాల్సిన ఎంజీఎం ఆస్పత్రిలో సమస్యలు తిష్ఠ వేశాయి. అవినీతి, నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. ఇక్కడ వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. వైద్యం కోసం వచ్చిన వారు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. ఆస్పత్రిలో చేరిన రోగుల ప్రాణాలు దినదిన గండంగా మారుతున్నాయి. మెరుగైన వైద్యం కోసం వస్తే కనీస వైద్యం కూడా అందక రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎంజీఎంలో పారిశుధ్యం పడకేయడంతోపాటు అంతర్గత రహదారులు అధ్వాన్నంగా మారాయి. ఎవరైనా అత్యవసర పరిస్థితిలో ఇక్కడికి చేరుకోవాలంటే గుంతలు పడిన రోడ్డుతో మధ్యలోనే ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. దీనికితోడు నిధుల కొరత ఆస్పత్రిలో వైద్య సేవలను స్తంభింపజేస్తోంది. అప్పుడప్పుడు అధికారులు తనిఖీలు చేసినా ఎంజీఎం పరిస్థితిలో మాత్రం మార్పు రావడంలేదంటూ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు సిద్ధం నరేష్ ఆరోపించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంజీఎం స్థితిగతులపై ఆయన మండిపడ్డారు.

- వరంగల్ వాయిస్, వరంగల్

- నిధులు కేటాయించని ప్రభుత్వం..
- నీరసించిపోతున్న వైద్యం
- కనీస సదుపాయాలూ కరువే
- దినదిన గండంగా మారుతున్న రోగుల బతుకులు
- తూతూ మంత్రంగా తనిఖీలు
- పర్యవేక్షణ లేక పరేషాన్
- స్పందించని అధికారులు, ప్రజా ప్రతినిధులు



7లో..

# దీనబంధు.. మేన శ్రీను

- విధి నిర్వహణలో నిక్కచ్చి
- నిరంతర శ్రమకు ప్రతీక
- సమాజ హితమే అభిమతం
- అందరి వాడిగా గుర్తింపు



8లో..

# రోడ్ల మరమ్మతులు చేపట్టండి

- పంటల నష్టం వివరాలను త్వరగా నమోదు చేయాలి
- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



8లో..

# ఓరుగల్లులో భారీ వర్షం

- అకాల వర్షంతో తడిసిపోయిన పత్తి, వరిధాన్యం
- జలమయమైన కాలనీలు



# ఎంజీఎంకు సుస్తీ

- నిధులు కేటాయించని ప్రభుత్వం..
- నీరసించిపోతున్న వైద్యం
- కనీస సదుపాయాలూ కరువే
- దినదిన గండంగా మారుతున్న రోగుల బతుకులు
- తూతూ మంత్రంగా తనిఖీలు
- పర్యవేక్షణ లేక పరేషాన్
- స్పందించని అధికారులు, ప్రజా ప్రతినిధులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రానికి రెండో రాజధానిగా వెలుగొందుతున్న వరంగల్ నగరంలోని మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) హాస్పిటల్ సమస్యలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. గత కొంతకాలంగా ఈ ఆసుపత్రి పరిస్థితి తీవ్రంగా దిగజారింది. ప్రజల ప్రాణాలకు దిక్కులేకుండా పోయింది. అవినీతి ఆకాశానికి చేరుకుంది. నిర్లక్ష్యం, సదుపాయాల లేమి రోగుల జీవితాలను చిదిమేస్తున్నాయి. అయినప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంజీఎంలో వైద్యం అందని ద్రాక్షగా మారింది. అయినా ప్రభుత్వం కళ్లు మూసుకున్నట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### వేధిస్తోన్న వైద్యుల కొరత..

ఎంజీఎంలో వైద్యుల కొరత వేదిస్తోంది. సీనియర్ వైద్యులు లేకపోవడంతో మెరుగైన వైద్యం కష్టంగా మారుతోంది. పీజీ వైద్యులు, హెడ్ నర్సులు మాత్రమే రోగులకు పెద్ద దిక్కుగా మారుతున్నారు. ఇక మానిటరింగ్ అటకెక్కింది. దీంతో ఉద్యోగులు ఇష్టారాస్యంగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. రాత్రివేళల్లో అయితే ఎలాంటి మానిటరింగ్ లేకపోవడంతో రోగులను పట్టించుకునేవారే కరువయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. ఎంతో మంది ఆర్ఎంఓలు ఉన్నప్పటికీ పర్యవేక్షించేవారే దిక్కులేదన్న ఫిర్యాదులున్నాయి. రోగులు తమ సమస్యలు చెప్పుకునేందుకు ఎవరూ అందుబాటులో లేకపోవడం తీవ్రమైన ఇబ్బందులకు కారణంగా మారుతోంది.

### అధ్వానంగా అంతర్గత రహదారులు..

ఎంజీఎంలోని అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. గుంతల మయంగా మారిన రోడ్లపై రోగులు నరకం అనుభవిస్తున్నారు. ముఖ్యమైన దారుల్లో సైతం గుంతలకు కొదవలేదు. ఎంజీఎంకు మూడు దారులున్నప్పటికీ ప్రతి దారిలో గుంతలే స్వాగతం పలుకుతున్నాయి. హాస్పిటల్ మొదటి గేట్ నుంచి ఎమర్జెన్సీ గేట్ వరకు ఉన్న ప్రధాన రహదారిలో సర్కస్ ఫీట్లు తప్పడంలేదు. ఈ రోడ్డులో అంబులెన్స్ వాహనాలు కుదుపుకు గురవుతున్నాయి. యాక్సిడెంట్ పేషెంట్లు గాయాలతోనే ఆ గుంతల్లో తిరగడంతో ద్వారా ప్రాణాల మీదకు వస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

### డబ్బుంటేనే పరీక్షలు..

ఎంజీఎంలో వైద్యం కోసం వస్తే పడిగాపులు తప్పడం లేదు. గంటలు, రోజుల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఎంజీఎంలోని లాబ్ లలో అవినీతి రాజ్యమేలుతోందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాదిరిగానే ఎంజీఎంలో కూడా డబ్బుంటేనే పరీక్షలు చేస్తున్నారని పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇచ్చిన వారి ల్యాబ్ రిపోర్టులు జెట్ స్పీడ్ లో వస్తుంటే నిధులు ఇచ్చుకోని వారి రిపోర్టులు అడుక్కు పడిపోతున్నాయి. దీంతో పలువురు ప్రైవేట్ ల్యాబ్ లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. అదే విధంగా పీఎం కేర్ పథకం కింద ఏర్పాటు చేసిన నిమిషానికి 1000 లీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి చేసే జనరేషన్ ప్లాంట్ గత నాలుగు నెలలుగా పనిచేయడం లేదన్న ఆరోపణలున్నాయి. అయితే దానిని మరమ్మతులు చేయించాల్సిన ఎంజీఎం సిబ్బంది రిపేర్ చేయకుండా ప్రైవేట్ కాంట్రాక్టర్ల నుంచి ఆక్సిజన్ కొనుగోలు చేస్తున్నారు. ప్రతి నెల ఆక్సీజన్ కోసం లక్షలు వెచ్చిస్తున్నారని చెప్పుకొంటున్నారు. అయితే ఇది పూర్తిగా అవినీతి మయంగా మారిందని చెప్పుకొంటున్నారు.

### వెంటాడుతున్న సమస్యలు..

ఎమర్జెన్సీ సెక్షన్‌లో నిత్యం అందుబాటులో ఉండాల్సిన డాక్టర్లు వారి సొంత పనులకోసం ఎంజీఎం నుంచి మధ్యంతరంగానే వెనుతిరుగుతున్నట్లు చెప్పుకొంటున్నారు. అధికారులు లేకపోవడంతో రోగులు, వైద్య సిబ్బంది మధ్య గొడవలు జరుగుతున్నది జగమెరిగిన సత్యం. అదే విధంగా రోగులకు ఇవ్వాల్సిన కాంబినేషన్ మందుల కొరత ఎంజీఎంలో తీవ్రంగా ఉంది. వైద్యులు రాసిన మందులు అక్కడ లేకపోవడంతో ప్రైవేట్ గా కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల అక్సీజన్ సరఫరా చేసే పైప్ లైన్ పగిలిపోయింది. దీంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది.

## ఎంజీఎంలో పది సమస్యలు..

**- బీజేపీ సీనియర్ నాయకుడు సిద్ధం నరేష్ పటేల్**



రోగులకు మెరుగైన వైద్యం అందించాల్సిన ఎంజీఎంలో పది సమస్యలు వెంటాడుతున్నాయని బీజేపీ సీనియర్ నాయకుడు సిద్ధం నరేష్ పటేల్ ఆరోపించారు. మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించి 12 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఎంజీఎం స్థితిగతుల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. అప్పుడు పది సంవత్సరాల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకకపోగా ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ దారిలోనే పయనిస్తోందని విమర్శించారు. హాస్పిటల్ ని అభివృద్ధి చేస్తారనుకుంటే నిధుల కొరతతో మరింత దిగజార్చారని మండిపడ్డారు. ఎంజీఎంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి ఒక్క అడుగూ కూడా ముందుకు పడడంలేదన్నారు. ఎంజీఎం హాస్పిటల్ పరిస్థితిని చూస్తుంటే తెలంగాణలో వైద్య రంగం ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతోందని సిద్ధం నరేష్ ఆరోపించారు. ఎంజీఎం పరిస్థితిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ఏమాత్రం పట్టించుకోని గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ కు పడుతోందని హెచ్చరించారు. ఇప్పుడు బీజేపీ ప్రజల పక్షాన నిలిచి అవినీతి, నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా పోరాడుతోందన్నారు. ఇప్పటికైనా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎంజీఎం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సిద్ధం నరేష్ పటేల్ హెచ్చరించారు.





## భూమి కోల్పోయిన రైతులకు పరిహారం

- కలెక్టర్ సత్య శారద
- గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పనుల పురోగతిపై సమీక్ష

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పనుల ల్యాండ్ ఆక్విజేషన్ పురోగతిపై అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్వో విజయ లక్ష్మి, ఆర్డీఓ నర్సంపేట ఉమారాణి, నేషనల్ హైవే బ్రిడ్జ్ మేనేజర్ తదితరులతో పాటు సంబంధిత అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే 163జీ మంచిర్యాల్-వరంగల్-ఖమ్మం జిల్లాలను కలుపుతూ ఏర్పాటు చేసిన నేషనల్ హైవే మొత్తం 176.52 హెక్టార్ల ల్యాండ్ అక్విజేషన్ కు గాను ఇప్పటివరకు 171.34 హెక్టార్ల ల్యాండ్ ఎక్విజేషన్ పూర్తి అయిందన్నారు. పెండింగ్ అవార్డును నవంబర్ 10 వరకు పూర్తి చేయాలని సంబంధిత ఆర్డీవోలను, సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 22.02 హెక్టార్ల ల్యాండ్ ఎక్విజేషన్ కోర్టు కేసులతో పెండింగ్ లో ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు పేమెంట్ పూర్తి చేసి అవార్డ్ పాస్ అయిన కేసులో మ్యుటేషన్ పూర్తి చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న చెల్లింపులను త్వరగా చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూమి కోల్పోయిన రైతుల నష్టపరిహారం త్వరిత గతిన చెల్లించి ల్యాండ్ ఆక్విజేషన్ త్వరగా పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, ఏడీ సర్వే ల్యాండ్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వండి

- అధికారులను ఆదేశించిన అడిషనల్ కలెక్టర్
- వరంగల్ వాయిస్ కథనానికి స్పందన



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పట్టణంలోని చెరువులు,కుంటలు ఆక్రమణకు గురవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదనే తలంపుతో "హద్దులు లేని చెరువులు" అనే శీర్షికతో ఈ నెల 1న వరంగల్ వాయిస్ లో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి స్పందన లభించింది.మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ డోర్నకల్ పట్టణంలో పర్యటించి ఆక్రమణ గురైన కొర్లకుంట, తోపాటు బంధం చెరువు, ఊరకుంట ప్రాంతాలను పరిశీలించారు. చెరువు, కుంటలు ఆక్రమణకు గురైన తీరును ఎమ్మార్వో రాఘవ రెడ్డి, ఐబీ ఏఈ కిషన్ తో వాకాపు చేశారు. మ్యాపులు ఆధారంగా కుంటల స్వరూపాన్ని, ఆక్రమైనకు గురైన తీరును పరిశీలించారు. వరద నీరు పారేందుకు రైల్వే డిపార్ట్ మెంట్ ద్వారా పట్టాల క్రింది నుంచి ఏర్పాటు చేసిన మోరీని వాటి ఆక్రమ తీరును గమనించారు. ఎస్సీ, బీసీ కాలనీ వద్ద ఉన్న పెద్దమూరి అక్కడి రోడ్డు కింద ఉన్న కల్వర్టు ద్వారా బంధం చెరుకు వస్తున్న నీటితో పాటు మైనార్టీ స్కూల్ వద్ద నిలువ ఉన్న నీటిని తొలగించేందుకు ఏర్పాటు చేస్తున్న పైపులను పరిశీలించారు. చెరువు, కుంటలను ఆక్రమించిన వారికి నోటీసులు ఇచ్చి అవసరమైతే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో, ఏఈతో పాటు కమిషనర్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా దాసరి నాని, లక్ష్మణ్, ప్రవీణ్ లు అడిషనల్ కలెక్టర్ కు తమ గోడును వివరించారు. ఆక్రమణపై అనేక మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆయన ఈ విషయాలపై చర్యలు తసుకుంటామని అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చారు.



# జూబ్లీహిల్స్ ప్రచారంలో కాంగ్రెస్ నేతలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, నవీన్ యాదవ్ తరపున, మంత్రి సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఆదేశాల మేరకు మంగళవారం శేఖ్ పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గడప గడపకు ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ జిల్లా లీగల్ సెల్ చైర్మెన్ శామంతుల శ్రీనివాస్, కార్పొరేటర్ బస్వారాజ్ కుమార్ అన్నారు. ఈ ప్రచారంలో పీసీసీ కార్యదర్శి కొత్తపెల్లి శ్రీనివాస్, యువజన నాయకులు చిన్న పటేల్, నాయకులు తిరునగిరి వెంకన్న,జన్ను ఆనంద్,సతీష్,రాజు మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై కేంద్రానిది కపట ప్రేమ

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** సీసీఐ కేంద్రాలలో కొనుగోళ్లలో పరిమితి లేకుండా రైతు ఎంత పత్తి పండిస్తే అంత పంటకు మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడుతూ సీసీఐ కొనుగోలు కేంద్రాలలో పత్తి కొనుగోలు ఒక రైతుకు ఎకరాకు 12 క్వింటాళ్లు నుంచి 7 క్వింటాలకు కుదించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక ఎకరానికి 10 క్వింటాళ్లు పత్తి పండిస్తే 7క్వింటాళ్లు కొనుగోలు చేస్తే మిగతా 3క్వింటాళ్ల కోసం దళారులను ఆశ్రయించడం వల్ల రైతు ఆర్థికంగా నష్టపోతాడని తెలిపారు. అధిక వర్షాలతో రైతులు ఇబ్బందులలో ఉన్నారని, రైతును ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి తీసుకురావద్దని సూచించారు. అలాగే 12 శాతం తేమ కాకుండా వర్షాభావ పరిస్థితుల వల్ల 20 శాతం తేమ ఉన్న మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై కపట ప్రేమ చూపిస్తూ రాష్ట్రంలో పంట నష్టం పై ప్రశ్నిస్తున్న బీజేపీ తమ పరిధిలోని ఆంక్షలను ఎత్తివేసి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారపెల్లి రవీందర్, చిందం రవి, మారపెల్లి వరదరాజు, రంగు బాబు, అంకేశ్వరపు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# యువతలో సమాజ సేవ పెంచడమే లక్ష్యం




**వరంగల్ వాయిస్, జనగామ :** జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రభుత్వ జూనియర్ కళాశాల జనగామ, ధర్మకంచ ఆధ్వర్యంలో మంగళవారం యశ్వంతాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఏడు రోజుల ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపల్ నాముని పావని కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నేటి విద్యార్థులలో మరియు యువతలో జాతీయ భావాన్ని పెంపొందించి, వారిని దేశ సేవలో పాల్గొనేలా ఎన్ఎస్ఎస్ కృషి చేస్తుందని తెలిపారు. జాతి నిర్మాణంలో, సామాజిక నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావడమే ఎన్ఎస్ఎస్ ముఖ్య లక్ష్యమని ఆమె ఉద్ఘాటించారు. పథకం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జానీ నాయక్ వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలలో ఉన్న వివిధ రుగ్మతలపై, ముఖ్యంగా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా చైతన్యం కల్పించాలని కోరారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మరిపెల్ల రవి ప్రసాద్, యశ్వంతాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దివాకర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ టు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వాస్కుల శ్రీనివాస్, సీనియర్ అధ్యాపకులు మొహమ్మద్ అబ్జల్, కళాశాల స్టాఫ్ సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతన్న ప్రభుత్వం

## డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి



**వరంగల్ వాయిస్, కేయూ :** పెండింగ్‌లో ఉన్న రూ.8,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి ఆరోపించారు. మంగళవారం కేయూ క్యాంపస్‌లోని వీఆర్ఎస్ హాస్టల్ ముందు స్కాలర్స్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను ఇప్పటివరకు విడుదల చేయకుండా ప్రభుత్వం మాటలతో కాలం గడుపుతోందని తిరుపతి విమర్శించారు. గతంలో ప్రైవేటు విద్యా సంస్థల యజమాన్యాలు ఆందోళన చేసినప్పుడు, ప్రభుత్వం రెండు విడతలుగా రూ. 1,200 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఆ హామీని నెరవేర్చకుండా మాట మార్చిందని విమర్శించారు. ప్రభుత్వానికి విద్యార్థుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదని, అందుకే ఫీజుల విడుదలలో జాప్యం చేస్తుందని అన్నారు. ఫీజులు విడుదల చేయాలని కోరితే, ప్రభుత్వం విజిలెన్స్ దాడులకు ఆదేశాలు ఇవ్వడం సిగ్గుమాలిన దుశ్చర్య అని, కక్షసాధింపు చర్యలు ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజులను వెంటనే విడుదల చేయాలి. ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యాలతో చర్చలు జరిపి వారి సమ్మెను విరమింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ స్కాలర్స్ నాయకులు కందికొండ తిరుపతి, కేతపాక ప్రసాద్, గుండేటి సుమన్, ఏ.సూర్య కిరణ్‌లు పాల్గొన్నారు.

# పేరు లేని కంపెనీ విత్తనాలు కొనొద్దు

- రైతు రక్షణ సమితి హెచ్చరిక



**వరంగల్ వాయిస్, పరకాల :** జిల్లాలో రైతులు నకిలీ విత్తనాలకు బలికాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు పిలుపునిచ్చారు. పరకాల వ్యవసాయ అభివృద్ధి అధికారి (ఏడీఏ)కి మంగళవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కొన్ని పేరు లేని కంపెనీలకు చెందిన దళారీలు గ్రామాలకు చేరుకుని అధిక దిగుబడులు వస్తాయని చెబుతూ రైతులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కంపెనీలకు ప్రభుత్వ అనుమతి, రిజిస్ట్రేషన్ లేకుండానే రైతులకు విత్తనాలు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. "ఇలాంటి విత్తనాలు వాడితే రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలు చవిచూడవలసి వస్తుంది. కాబట్టి రైతులు ప్రభుత్వ గుర్తింపు ఉన్న కంపెనీల విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి. అవసరమైతే ముందస్తు ఒప్పందాల ద్వారా పంట సాగు చేయాలి," అని కిషన్ రావు సూచించారు. తుఫాను కారణంగా ఇప్పటికే పంటలు నష్టపోయిన రైతులు మళ్లీ మొక్కజొన్న పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో, నకిలీ విత్తనాలు అందితే పరిస్థితి మరింత దయనీయమవుతుందని ఆయన హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు పూర్తి సమాచారం అందించాలని సమితి అధికారులు ఏడీఏను కోరారు. ఈ కార్యక్రమంలో నాగుర్ల రాజీవ్, మోడే మోహన్ రావు, బాసిడి బాపూరావు, జుంక జువ్వ రవి, రైతు రక్షణ సమితి సంఘం రైతులు పాల్గొన్నారు.

# కార్తీక దీపోత్సవానికి భక్తుల విరాళం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని చారిత్రక కాకతీయుల కళాక్షేత్రం శ్రీ నాగలింగేశ్వరాలయం రెడ్డిగుడిలో మంగళవారం నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ అభివృద్ధికి భక్తులు విరాళాలతో ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రానికి చెందిన సూర్యదేవర స్రవంతి కార్తీక్ దంపతులు కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయానికి 15 లీటర్ల నూనె, 516 మట్టి ప్రమిదలను, దీపధూప పూజాసామగ్రి అందజేశారు. అదేవిధంగా వెలిశాల విజయలక్ష్మి పట్టాభి కుటుంబం కూడా 15 లీటర్ల నూనె, పట్టు వస్త్రాలు, పూజా సామగ్రి సమర్పించారు. అదేవిధంగా వంతెనగిరి ఉష అశోక్ దంపతులు 365 మట్టి ప్రమిదలను అందించి కార్యక్రమానికి తోడ్పడ్డారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపోత్సవం సందర్భంగా ఆలయం పరిసరాలు దీపాలతో అలంకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

■ కలెక్టర్ రాహుల్ శర్మ



**వరంగల్ వాయిస్, మల్హర్/ భూపాలపల్లి:** పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహించేవారికి వేతనాల్లో కోత విధించాలని జిల్లా ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షకులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు.మంగళవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్, సాధారణ వార్డులు, ఐసీయూ వార్డులు, రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, ఓపీ సేవలు, సహాయక కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం అన్ని విభాగాల ప్రధాన వైద్యులతో సమావేశం నిర్వహించారు. సిబ్బంది ఖచ్చితమైన సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వార్డుల్లో పర్యటించిన కలెక్టర్, చికిత్స పొందుతున్న రోగుల దగ్గరకు వెళ్లి వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను భద్రపరచడం కోసం జిల్లా వైద్య శాఖ ఆధీనంలో ఖాళీగా ఉన్న భవనాన్ని వినియోగించాలని సూచించారు. ప్రసూతి విభాగాన్ని సందర్శించిన కలెక్టర్ వివరాలు అడుగగా ప్రతి నెల 160–180 ప్రసవాలు జరుగుతున్నాయని వైద్యులు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్ ఉపయోగించటం లేదని గుర్తించి, లీకేజీల కారణంగా వినియోగం ఆగిపోయిందని వైద్యులు తెలుపగా, వెంటనే మరమ్మతులు చేసి సేవల్లోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, రోగుల భద్రత, నాణ్యమైన వైద్యసేవలు నిర్దేశిత విధానంలో అమలు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఆర్ఎంఓ దివ్య అని విభాగాల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావుకు జిల్లా నేతల పరామర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** హైదరాబాద్ లో హరీష్ రావు నివాసంలో తన తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు అకాల మరణం చెందగా వారి చిత్రపటానికి నర్సంపేట మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డి, వరంగల్ ఏనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు చింతం సదానందం, తునికి రమేష్ బాబు, మేడిపల్లి శోభన్ బాబు, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొల్ల బోయిన రవి యాదవ్, రాజు, రవీందర్ నివాళులర్పించి మాజీ మంత్రి హరీష్ రావును పరామర్శించారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో భోజనం పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి ఆదేశాల మేరకు గుండ్ల సింగారం ఇందిరమ్మ కాలనీ వరద ప్రభావిత ప్రాంతాల్లోని మహిళలకు, పిల్లలకు అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో ఒక పూట భోజనం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సుధాకర్, రాజేందర్ ప్రసాద్ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థలపై మహిళలకు, స్థానికులకు అవగాహన కల్పించారు. బడి బయట ఉన్న పిల్లలని గుర్తించి, వారిని చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్‌లో చేర్పించవలసిందిగా తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత షేర్ ఎన్జీవో ప్రతినిధి, అంగన్వాడి టీచర్, హెల్పర్ పాల్గొన్నారు.

## కోటగుళ్లలో ఫ్రాన్స్ దేశస్థుల సందడి

### స్వామివారికి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం:** కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో మంగళవారం ఫ్రాన్స్ దేశస్థులు సందడి చేశారు. ఫ్రాన్స్ దేశానికి చెందిన ఎరిఫ్, ఎలిక్ లు ఆలయాన్ని సందర్శించారు. మొదట స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ పరిసరాలను ఫోటోలు వీడియోలు చిత్రికరించుకున్నారు కోటగుళ్ల చరిత్రను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజును అడిగి తెలుసుకున్నారు. ఆలయ నిర్మాణం అద్భుతమని కొనియాడారు.

## సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని రైతులు వారు పండించినటువంటి పత్తిని 8 నుంచి 12 తేమ శాతం మించకుండా సీసీఐ కేటాయించిన కేంద్రానికి మాత్రమే తీసుకెళ్లి మద్దతు ధర రూ.8110 పొందాలని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి కోరారు. రైతులు పత్తిని విక్రయకేంద్రానికి తీసుకెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నాణ్యమైన ఆరబెట్టిన పత్తిని పత్తి విక్రయకేంద్రాలకు తీసుకువెళ్ళే క్రమంలో వాతావరణంలో మార్పుల ద్వారా వర్షాలు పడే అవకాశం ఉన్నందున దయచేసి టార్పాలిన్ తో పత్తిని కవర్ చేసి తీసుకువెళ్లాలని రైతులకు సూచించారు.

## డే కేర్ సెంటర్ సేవలను సీనియర్ సిటిజన్స్ వినియోగించుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి హనుమకొండలోని జిల్లా పరిషత్తు ఆవరణలో ఉన్న సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌ను సందర్శించారు. వయోవృద్ధుల కోసం సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్లినిక్ మరియు లీగల్ ఎయిడ్ క్లినిక్ పనితీరును ఆమె పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. పారా లీగల్ వలంటీర్ ఉపెందర్ ద్వారా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు అందిస్తున్న న్యాయ సలహాలు, సూచనలపై ఆమె వివరాలు సేకరించారు. నమోదైన కేసుల సంఖ్య, న్యాయ సలహా కోసం వచ్చిన వారి సంఖ్య, కౌన్సిలింగ్‌కు హాజరైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో అందిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ, ఉచిత న్యాయ సలహాల కేంద్రాన్ని వృద్ధులు తప్పకుండా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వృద్ధులకు సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు ఒక వరం లాంటిదని అభివర్ణించారు. జిల్లా ట్రిబ్యునల్ కోర్టుకు వస్తున్న కేసులు, వాటి పనితీరు గురించి ఆమె వివరించారు. వృద్ధులకు మరింత సేవలు అందించడానికి, సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి, అన్ని డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో (కన్వర్జెన్స్) వయోవృద్ధుల కోసం పనిచేయడానికి చర్చించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డితో పాటు డాక్టర్ ఉష, పారా లీగల్ వలంటీర్ ఉపేందర్, వాణి తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ప్రచారం



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ, బడుగు బలహీన వర్గాల నాయకులు కొండా మురళీధర్ రావు నాయకత్వంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన సుమారు 150 మంది ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ ని గెలిపించాలని ప్రచారం చేశారు. షేక్‌పేటలో ప్రతి ఇంటికి వెళ్లి నవీన్ యాదవ్ 'చేతి గుర్తుపై' ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తో పాటు, టీపీసీసీ కార్యదర్శులు మీసాల ప్రకాష్, కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు కత్తెరసాల వేణుగోపాల్, జారతి రమేష్, మడిపల్లి కృష్ణ, మబ్బు ప్రవీణ్, బసాని శ్రీనివాస్, మహమ్మద్ వసీం, ముష్కమల్ల సుధాకర్, బైరబోయిన దామోదర్ యాదవ్, భోగి సురేష్, బెడుద వీరన్న, బోయిన దూడయ్య, కురిమిళ్ళ సంపత్, నాగపూరి సంజయ్ బాబు, ఠాగూర్ బజరంగ్ సింగ్, ఎలగం సత్యనారాయణ, మంద శ్యామ్, బత్తిని అఖిల్, సంగారబోయిన చందర్, మేడిది మధు. కార్పొరేటర్లు బసవరాజు కుమార్, సోమిశెట్టి ప్రవీణ్, వసుకుల బాబు, ఆకుతోట శిరీష్, కోలబోయిన చిన్నా పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త విజ్ఞాపన కార్యక్రమం నిర్వహించబడింది. ఇందులో భాగంగా త్రిమూర్తులైన జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్, డాక్టర్ విశారదన్ మహరాజ్, రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు, బాలరాజ్ గౌడ్ ల ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్, ఇంటలెచ్యువల్ ఫోరం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ చైర్మన్ డాక్టర్ చందా మల్లయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సహా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు తమ ఎంపీల ద్వారా 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో పెట్టేందుకు పోరాటం చేయాలన్నారు. ఈ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి, దానికి చట్టబద్ధత కల్పించాలి. కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చి, బీసీల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలి. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్ ఎలా తెచ్చారో, అదేవిధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా 42% బీసీ రిజర్వేషన్‌కు చట్టం చేసి, 9వ షెడ్యూల్‌లో చేర్చి బీసీలకు న్యాయం చేయాలి. నాయకులంతా ఒకే తాటిపైకి వచ్చి, చాలా కాలంగా వెనుకబడిన బీసీల భవిష్యత్తు, రాబోయే తరాల పిల్లల విద్య, ఉద్యోగ రంగాల్లో, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కోసం కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, బీసీ జాక్ కన్వీనర్ తిరునహరి శేషు, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కే.వీరస్వామి, రిటైర్డ్ ప్రొఫెసర్ సారంగపాణి, భారత సమాఖ్య మహిళా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సదా లక్ష్మి, తెలంగాణ రాష్ట్ర మేదరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గైనీ.రవీందర్, కో ఆర్డినేటర్లు మేకల సుమన్, పొదిల సాయిబాబా, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బుర్ర.దామోదర్ గౌడ్, బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్యవర్గ సభ్యులు, మహిళలు, విద్యార్థులు, మేధావులు పాల్గొన్నారు.

# ఘనంగా వైబ్రెంట్-25 ఫెస్ట్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వైబ్రెంట్ అకాడమీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు మంగళవారం కేఎల్ఎన్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా వైబ్రెంట్-25 ఫెస్ట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హనుమకొండ డీఈఓ ఏ.గోపాల్ ముఖ్య అతిథిగా వచ్చి విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం వైబ్రెంట్ అకాడమీ డైరెక్టర్ సీహెచ్.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వైబ్రేంట్ స్థాపించిన రెండు సంవత్సరాలలోనే దాదాపుగా 900మంది విద్యార్థిని విద్యార్థులకు కోటా రాజస్థాన్ ఫ్యాకల్టీతో పాటు నాణ్యమైన కోటా స్టడీ మెటీరియల్, ఐఐటి జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నామని తెలియజేశారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఐపీఈ మార్చి 2025లో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. తదనంతరం కళాశాల ప్రిన్సిపాల్ శేషు కుమార్ మాట్లాడుతూ సమయపాలన, ప్రణాళిక ప్రకారం చదివితే విద్యార్థులు జనవరిలో జరిగే మెయిన్స్



పరీక్షలు, ఫిబ్రవరిలో జరిగే వార్షిక పరీక్షలలో ఉన్నతశ్రేణి మార్కులు సాధించగలరని తెలియజేశారు. ఈ ఫెస్ట్ లో ప్రముఖ జానపద గాయని శిరీష ఆలపించిన గీతాలు విద్యార్థినీ విద్యార్థులను అలరింపచేశారు. ఈ కార్యక్రమంలో సిటీ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.అమర జ్యోతి, ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారుని హిమాన్షు కాట్రగడ్డ, యోగా మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఎగ్జిక్యూటివ్స్, తదితరులు పాల్గొన్నారు.





# 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్'



**వరంగల్ వాయిస్, వరంగల్:** స్థానిక లాల్ బహదూర్ కళాశాలలో 10వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్' విజయవంతంగా నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ విజిలెన్స్ వారోత్సవాలు అక్టోబర్ 27 నుంచి నవంబర్ 3 వరకు జరిగాయి. అవినీతి రహిత సమాజం కోసం ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. అవినీతి అనేది క్యాన్సర్ వ్యాధి లాంటిదని, ఇది దేశ అభివృద్ధికి ప్రమాదకరమని అన్నారు. అవినీతి ఏ రూపంలో ఉన్నా దేశ సంపద దోచుకోబడకుండా ఉండాలంటే ప్రజలు చైతన్యవంతంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ముందు విజిలెన్స్ వారం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కళాశాల పరిపాలన భవనం నుంచి ములుగు రోడ్డు జంక్షన్ వరకు ఎన్‌సీసీ విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అవినీతి నిర్మూలన కోసం అందరూ చైతన్యవంతులు కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, సీనియర్ అండర్ ఆఫీసర్ మోహన్, జూనియర్ అండర్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఆసియా, సాహిత్య, రవళి, సాయి చందర్, సిరివెన్నెల, లక్ష్మీ ప్రసాద్, కౌశిక్, సాయి కృష్ణ, అభినవ్, హరి లోకేష్, సాయి, రజిత మొదలైన ఎన్‌సీసీ వలంటీర్లు పాల్గొన్నారు.

# అమ్మ ఫౌండేషన్‌కు తొమ్మిది వసంతాలు

◆ నూతన కార్యాలయం ప్రారంభం

**వరంగల్ వాయిస్, జనగామ:** జనగామ అమ్మ ఫౌండేషన్ తొమ్మిది వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనగామ పట్టణంలోని సంజయ్ నగర్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 'జనగామ అమ్మ క్యాంటీన్' పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. జనగామ అమ్మ ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు దివంగత కొండా జగన్నాథం తనయుడు, సీనియర్ జర్నలిస్ట్, పద్య నాటక నటులు అయిన కొండా శ్రీనివాస్ రావు ప్రారంభించారు. కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం కొండా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ తన చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని, తక్కువ సమయంలోనే అమ్మ ఫౌండేషన్ మంచి పేరు తెచ్చుకుందని ప్రశంసించారు. ఇటువంటి సామాజిక కార్యక్రమాలు కొనసాగాలంటే ఆర్థిక బలం, ఓపిక, సహనం, సమన్వయ ధోరణి ఉండాలని తెలిపారు. తన తండ్రి 55 సంవత్సరాల క్రితమే తమ గ్రామ ప్రజలకు వైద్యం, విద్య అందుబాటులో ఉండాలనే పట్టుదలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారని గుర్తుచేశారు. దృఢ సంకల్పం, పట్టుదల



ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆనాడే చేసి చూపారని తెలిపారు. అమ్మ ఫౌండేషన్ గత తొమ్మిది సంవత్సరాలుగా చేస్తున్న కృషి ఫలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, ఫౌండేషన్ కార్యక్రమాలను అన్ని ప్రాంతాల వారికి చేరవేయడానికి మీడియా ద్వారా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ అవకాశం కల్పించిన అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంతెన మణికి, సభ్యులకు కొండా శ్రీనివాస్ రావు, వారి కుటుంబ సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# పిడుగుపాటుకు రైతు మృతి



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల మండలంలోని పోచారం గ్రామంలో మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో పిడుగుపాటు సంభవించింది. ఈ దుర్ఘటనలో పూస మహిపాల్ అనే రైతు, ఒక ఎద్దు మృత్యువాత పడ్డారు. అకాల వర్షం కారణంగా పిడుగులతో పాటు కురిసిన వర్షం వల్ల మనుషులతో పాటు పశువులు కూడా నష్టపోయారు. అలాగే, పొలాల్లో ఉన్న వరి, పత్తి, మిర్చి పంటలకు కూడా నష్టం వాటిల్లింది.

# ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటనకు ఏర్పాట్లు చేయండి

■ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**వరంగల్ వాయిస్ మల్హర్/ భూపాలపల్లి:** జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, పరిపాలనా విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజా సంక్షేమ పథకాల అమలు పరిశీలనకు ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం జిల్లా పర్యటనకు వస్తున్నందున శాఖల వారీగా సమగ్ర నివేదికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ట్రైని అధికారుల పర్యటన సందర్భంగా మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వైద్య, విద్య, మిషన్ భగీరథ, సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ట్రైనీ అధికారులు విద్యా, వైద్య, అంగన్ వాడి కేంద్రాలు, స్వయం సహాయక సంఘాలు నిర్వహణ, నర్సరీలు, డంపింగ్ యార్డులు, మిషన్ భగీరథ వంటి పథకాల అమలుపై వివరాలు అందించాలని ఆదేశించారు. పలిమెల మండలం లెంకల గడ్డ, మహాముత్తారం మండలం ములుగుపెల్లిలో పంచాయతీలలో పర్యటన ఉంటుందని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అదే గ్రామాలలో బస చేయాల్సి ఉంటుందని ప్రాథమిక పాఠశాలలో బస, భోజన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధికారులు ముందస్తుగా



మండలంలో పర్యటించి ఏర్పాట్లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అధికారుల పర్యటనకు సంబంధించి ప్లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేయాలని సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు చేయాలని తెలిపారు. రవాణా పర్యవేక్షణ కు లైజనింగ్ అధికారులను నియమించాలని అన్నారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డీఈఓ రాజేందర్, సంక్షేమ అధికారిని మల్లేశ్వరి, మిషన్ భగీరథ ఈఈ శ్వేత, ఆయా మండలాల తహసీల్దారులు, ఎంపీడీవోలు, సీడీపీఓ తదితరులు పాల్గొన్నారు

# 17న మహా రుద్రయాగం

**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాలలోని కుంకుమేశ్వర ఆలయంలో ఈ నెల 3న జరగాల్సిన మహా రుద్ర యాగం తుఫాను కారణంగా వాయిదా పడింది. వేద పండితులు కోమాళ్ల సంపత్ కుమార్ శర్మ నిర్ణయం మేరకు మహా రుద్రయాగాన్ని తిరిగి ఈ నెల 17వ తేదీన నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయాన్ని మహా రుద్రయాగ చైర్మన్ ఎర్రం లక్ష్మన్న, కో కన్వీనర్ గందె రవి, ఆలయ చైర్మన్ రాజేశ్వరరావు తెలిపారు. మహా రుద్రయాగానికి ఏర్పాట్లలో భాగంగా మంగళవారం కార్తీక మాస మహా రుద్రయాగ సమితి, ఆలయ కమిటీ, భక్తులు కలిసి పరకాల పట్టణంలోని అన్ని దేవాలయాలను, గ్రామ దేవతలను దర్శించుకున్నారు. అనంతరం కుంకుమేశ్వర స్వామి ఆలయం యాగశాల నుంచి భక్తుల సమక్షంలో సర్వదేవతారాధన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, తోట రవి, గోవింద సంధ్యా సత్యనారాయణ, మహా రుద్రయాగ సమితి అధ్యక్షులు ఎర్ర లక్ష్మణ్, కన్వీనర్ గంధె రవి, కో కన్వీనర్ ఆముదాలపల్లి అశోక్, ప్రధాన కార్యదర్శి పల్నాటి సతీష్, కోశాధికారి తోట భద్రయ్య మరియు భక్తులు అడగాని జనార్ధన్, ముడతనపల్లిం చేరాలు, పిట్ట వీరస్వామి, పంచగిరి భాస్కర్, వసంత కవిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.



# పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది కలగొద్దు

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ:** పత్తి విక్రయించడానికి వచ్చే రైతులకు జిన్నింగ్ మిల్లుల యాజమాన్, సీసీఐ అధికారులు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. పత్తి కొనుగోళ్లపై వ్యవసాయ, మార్కెటింగ్, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యంతో కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీలక సూచనలు చేశారు: భారీ వర్షాల కారణంగా రైతులు ఇప్పటికే ఎన్నో ఇబ్బందులు పడుతున్నందున, నాణ్యత పేరుతో పత్తిని తిరస్కరించకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు సమస్యలు తలెత్తకుండా, ముఖ్యంగా తేమ శాతం వంటి కారణాలతో వారి పత్తిని కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేయవద్దని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యం, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ, సీసీఐ అధికారులను ఆదేశించారు. యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పత్తి కొనుగోలుపై రైతులకు తగిన అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బెంష్ లోమ్, డీసీపీ రాజా మహేంద్ర నాయక్, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, జిల్లా ఫైర్ అధికారి, విద్యుత్ శాఖ అధికారి, సీసీఐ అధికారి, మార్కెట్ కమిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్‌ఎం ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



**వరంగల్ వాయిస్, పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల పెండింగ్ వేతనాలు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎన్హెచ్‌ఎం నాయకులు మంగళవారం డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వాణి శ్రీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్ హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు ఎల్.సురేష్ నాయక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వినతిపత్రంలో రెండు నెలల పెండింగ్ వేతనాలు మరియు ఏడు నెలల పీఆర్‌సీ ఏరియర్స్ ను తక్షణమే చెల్లించాలి. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎన్హెచ్‌ఎం ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలి. ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయంలో పనిచేస్తున్న డీపీపీఎం ప్రభాకర్, ఎన్టీఈపీ సిబ్బంది గోపి, తిరుపతి, రవీందర్, శ్రీనివాస్, శ్రావణి, సురేందర్; అలాగే ఎన్ హెచ్‌ఎం ఉద్యోగులు అంజయ్య, సురేష్, పావని, మమత, సంపత్ పాల్గొన్నారు.

# వైన్ షాప్‌లను మార్చాలి



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండల కేంద్రంలోని బస్టాండు, పాఠశాలల సమీ పంలో ఉన్న వైన్స్ బెల్ట్ షాపు లను తొలగించాలని మంగళ వారం స్థానిక తహసీల్దార్ ఇమామ్ బాబా షేక్ కు వినతి పత్రం పత్రం అందజేశారు. వీసీకే రాష్ట్ర యూత్ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల అనిల్ కుమార్, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి భూక్యా నవీన్ ఆధ్వర్యంలో తహసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు.

# 16న ఆర్యవైశ్యుల కార్తీకమాస వనభోజనాలు

■ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, అన్ని విభాగాల ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వరంగల్ జిల్లాలోని ప్రతిష్ఠాత్మకమైన శ్రీ భద్రకాళి అమ్మవారి దేవస్థానం ఆవరణలో మంగళవారం ఈ నెల 16న నిర్వహించే వనభోజనాల ఆహ్వాన పత్రాన్ని భద్రకాళి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద బ్రాహ్మణులతో మంత్రాలు చదివించి విడుదల చేశారు. అమ్మవారి ప్రధాన అర్చకులు శేషయ్య మంత్రాలతో కుంకుమ పూజలు చేసి ఆహ్వాన పత్రాన్ని రిలీజ్ చేశారు. చరిత్ర కలిగిన ఆర్యవైశ్యులు అమ్మవారి సన్నిధిలో వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేసుకోవడం సంతోషదాయకమని, అందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని అర్చకులు ఆకాంక్షించారు. ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ వేలాది మందితో గత కొన్ని సంవత్సరాలుగా కార్తీక మాసం సందర్భంగా వనభోజన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈసారి భద్రకాళి అమ్మవారి దేవస్థానం సన్నిధిలో వేలాది మంది ఆర్యవైశ్యులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు, మహిళలకు, పురుషులకి, కపుల్స్‌కి (దంపతులకి), వృద్ధులకి, పిల్లలకి సుమారు 25 రకాల క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలుపొందిన ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉసిరి చెట్టు వద్ద ఒత్తులు కాల్చుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న వైశ్యులంతా సకుటుంబ సపరివారంగా విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొంది, వనభోజన మహోత్సవాన్ని దిగ్విజయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేంద్రబాబు, రాష్ట్ర కార్యదర్శి వంగవీటి అశోక్, ఉపాధ్యక్షులు ఓలం సదాశివుడు, దాచేపల్లి సీతారాం, శ్రీరామ్ శ్రీనివాస్, సోమ అశోక్, శ్రీరామ్ రవీందర్, నాగ బండి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు సొల్లేటి కళావతి, కార్యదర్శి గార్లపాటి శ్రీలత, కోశాధికారి తాటి పెల్లి రాజమణి, ఉపాధ్యక్షురాలు దాచేపల్లి రాణి; యువజన విభాగం అధ్యక్షుడు యాద రవికుమార్, సేవాదళ్ అధ్యక్షుడు రఘుబాబు పుల్లూరు, కార్యదర్శి కిషన్, సనిక రమేష్, మండల అధ్యక్షులు ఇమ్మడి శ్యాంబాబు, అనంతుల వీరేందర్; సంఘ నాయకులు తోట పూర్ణచందర్, సదాశివుడు, పబ్బతి సత్యనారాయణ, దివ్వెల పూర్ణచందర్, పళ్ళ పరమేశ్వర్, శివ తదితరులు పాల్గొన్నారు.

# హసన్ పర్తిలో ఇంటర్ సిటి, సిర్పూర్ కాగజ్‌నగర్ అపాలి



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** రైల్వే డివిజనల్ మేనేజర్ ఆర్. గోపాలకృష్ణన్ హసన్ పర్తి రైల్వే స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 66వ డివిజన్ కార్పొరేటర్ కురుమూర్తి శివకుమార్ వారిని శాలువాతో సన్మానించి, హసన్ పర్తి రైల్వే స్టేషన్ లో ఇంటర్ సిటి, సిర్పూర్ కాగజ్‌నగర్ రైళ్లు అపాలని రైల్వే డివిజనల్ మేనేజర్ ఆర్. గోపాలకృష్ణన్ మెమోరాండం అందజేశారు, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మారం తిరుపతి, మాజీ మార్కెట్ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి కోయడ రాజు , ఇమ్మడి కర్ణాకర్ , కుంబర్కర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, చిట్యాల :** జన విజ్ఞాన వేదిక ఆ ధ్వర్యంలో విద్యార్థులకు నిర్వ హించే చెకుముకి టాలెంట్ టె స్ట్ పోస్టర్ ను మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపా ధ్యాయులు శ్రీరామ్ రఘుపతి ఆవిష్కరించారు. ఆయన మా ట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడమే చెకుముకి టాలెంట్ టెస్ట్ ఉద్దేశమని శ్రీరామ్ రఘుపతి తెలిపారు. పాఠశాలల స్థాయిలో ఈనెల 7న, మండల స్థాయిలో ఈనెల 21న పరీక్షను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధులు వేల్పుల రాజు రాధాకృష్ణ, మండల కన్వీనర్ సూదం సాంబమూర్తి,బొమ్మ రాజమౌళి, బుర్ర సదయ్, కూచనపల్లి శ్రీనివాస్,సాంబారు రామనారాయణ, నీలిమా రెడ్, సరళ దేవి, విజయలక్ష్మి, మోరిశెట్టి సుజాత,తుమ్మ మౌనిక, మురారి కల్పన, గడ్డం శంకర్, ఉస్మాన్ వలీ, తుమ్మ మౌనిక పాల్గొన్నారు

# పీడీఎస్‌యూ మహాసభలను జయప్రదం చేయండి

■ మహాసభల లోగో ఆవిష్కరించిన ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే




**వరంగల్ వాయిస్, వరంగల్:** ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర 23వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఈ మహాసభలు డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో జరగనున్నాయి. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, చారిత్రాత్మక పోరాట వారసత్వం ఉన్న పీడీఎస్ యూ రాష్ట్ర మహాసభలు ఉద్యమాల కేంద్రమైన వరంగల్ జిల్లాలో నిర్వహించడం అభినందనీయమని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల విద్య పేదలకు మరింత దూరం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కార్పొరేట్, పెట్టుబడిదారులకు ఊడిగం చేసేందుకే నడుస్తున్నాయని, దీనికి ప్రభుత్వ విద్యా రంగం ధ్వంసం అవ్వడమే, అనేక పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు మూసివేతకు గురికావడమే నిదర్శనం అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 2020 తీసుకురావడం ద్వారా విద్యా రంగాన్ని పూర్తిగా ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. దీనివల్ల ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీల్లో కోర్స్ ఫీజులు, ఎగ్జామినేషన్ ఫీజులు పెరిగి, ఆర్థిక భారంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారు.విద్యార్థుల మెదళ్లను కలుషితం చేయడానికి పాఠ్యాంశాల్లో మూఢనమ్మకాలు, మతోన్మాదం చెబుతున్నారని, ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యాంశాల్లో గాంధీని చంపిన గాడ్సే పాఠాలను తీసివేయడం చరిత్ర వక్రీకరణలో భాగమే అని విమర్శించారు. అంతర్జాతీయ విద్యార్థి ఉద్యమాల స్ఫూర్తితో దేశ విద్యార్థిలోకం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి రంగవల్లి, కోలాశంకర్, చేరాలు వంటి ఎందరో అమరవీరుల త్యాగంతో పురుడు పోసుకున్న PDSU సంస్థ విద్యార్థి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని ఆకాంక్షించారు. మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి మైసా శ్రీనివాస్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు.పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు కూడా విద్యార్థులకు ఇవ్వకుండా మొండిగా వ్యవహరిస్తుండడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతోందని తెలిపారు. పాలకులు మారినా విధానాలు మారకపోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని, సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు సమరశీల ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ జాతీయ నాయకులు పి.మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనగిరి మధు, డాక్టర్ రాజేష్, పీడీఎస్ యూ వరంగల్ జిల్లా అధ్యక్షులు గుర్రం అజయ్, ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, రాజేందర్, బాలరాజు, బండి కోటేశ్వర్ పాల్గొన్నారు.



- విధి నిర్వహణలో నిక్కచ్చి
- నిరంతర శ్రమకు ప్రతీక
- సమాజ హితమే అభిమతం
- అందరి వాడిగా గుర్తింపు

**అవకాశాలు రావు సృష్టించుకోవాలి. అదృష్టం తలుపు తట్టదు. మనమే తట్టి లేపాలి. డిగ్రీలు మాత్రమే అర్హత కాదు. పట్టుదలను మించిన పట్టాలు లేవు. ఇవన్నీ ఉమ్మడి వరంగల్ జిల్లా మరిపెడ ముద్దుబిడ్డ.. ప్రస్తుత హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మేన శ్రీను గెలుపు కథలోని కీలక వ్యాఖ్యలు. బట్టల దుకాణం నడిపే ఓ మధ్యతరగతి ఇంట పుట్టిన ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంపీడీవోగా, డిప్యూటీ సీఈఓగా, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా విశిష్ట సేవలు అందించారు.**





# దీన బంధు.. మేన శ్రీను





ప్రస్తుతం హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ గా పనిచేస్తున్న మేన శ్రీను దీనబంధువుగా ఖ్యాతి గడించారు. సమాజ హితాన్ని కాంక్షిస్తూ.. పేద ప్రజలకు సేవ చేయాలన్న తపనతో ఆయన ముందుకెళ్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థను ప్రగతి పథంలో నిలిపిన ఘనత ఆయనకు దక్కింది. సెర్ప్, ఈజీఎస్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ పేదల పెన్నిధిగా పేరు గడించారు. జిల్లా ప్రజానీకానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అత్యుత్తమ సేవలను అందిస్తున్న ఆయన యువ ప్రభుత్వ అధికారులకు స్ఫూర్తి ప్రదాత. ప్రభుత్వ అధికారిగా గత రెండున్నర దశాబ్దాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న మేన శ్రీనును వరంగల్ వాయిస్ పలకరించింది.

## బాల్యం..

1975 ఫిబ్రవరి 2న మహబూబాద్ జిల్లా మరిపెడ బంగ్లాలో మేన కనకమ్మ–లక్ష్మీనారాయణ దంపతులకు శ్రీను జన్మించారు. తల్లిదండ్రులది బట్టల వ్యాపారం. వీరి అక్క నిర్మల, బావ సీహెచ్.కృష్ణ ఖమ్మంలో వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. 1999 ఫిబ్రవరి 24న నాటి ఖమ్మం జిల్లా, నేటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముత్యాలపాడు గ్రామానికి చెందిన విద్యావంతురాలు సరస్వతిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు రఘువంశీ, ఎంబీఏ పూర్తి చేయగా, చిన్న కుమారుడు కృష్ణవంశీ బీటెక్ మూడో సంవత్సరం విద్యనభ్యసిస్తున్నారు. మేన శ్రీను–సరస్వతి దంపతులు కుటుంబాన్ని విద్యా నిలయంగా మార్చారు.

## విద్యాభ్యాసం..

ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాలలోనే మేన శ్రీను విద్యాభ్యాసం కొనసాగింది. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు మరిపెడలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. ఇంటర్మీడియట్ ను మరిపెడలోని ఆర్ డీఆర్ఎం కళాశాలలో పూర్తి చేశారు. హైదరాబాదులోని నిజాం కళాశాలలో బీఏ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ (ఎకనామిక్స్), ఆ తరువాత ఎల్ఎల్ బీ పూర్తి చేశారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో శ్రీను విద్యాభ్యాసం నిరాటకంగా కొనసాగింది.

## ఉద్యోగ ప్రస్థానం...

ఉన్నత చదువులు పూర్తి కాగానే మేన శ్రీను ఏపీపీఎస్సీ పోటీ పరీక్షలకు హాజరయ్యారు. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్–1 క్యాటగిరిలో ఎంపీడీవో ఉద్యోగం లభించింది. 1999 అక్టోబర్ 21న ప్రభుత్వ సర్వీసులో చేరిన ఆయన హైదరాబాదులోని అపార్డ్ లో ఆరు నెలల పాటు శిక్షణ పొందారు. అనంతరం 2000 సంవత్సరంలో పురిటి గడ్డ మరిపెడ మండలంలో ఎంపీడీవోగా తొలి పోస్టింగ్ పొందారు. తర్వాత ఏటూరు నాగారం, మంగపేట, హనుమకొండ, రఘునాథ్ పల్లి మండలాల్లో మండల అభివృద్ధి అధికారిగా విశిష్ట సేవలు అందించారు. అనంతరం ఎన్నికల ప్రక్రియలో భాగంగా కరీంనగర్ కు బదిలీపై వెళ్లారు. అక్కడ కొంతకాలం ఎంపీడీవోగా పనిచేసిన తర్వాత హసన్ పర్తి, హనుమకొండ మండల అభివృద్ధి అధికారిగా సేవలందించి ప్రజల మన్ననలు పొందారు. 2018లో డిప్యూటీ సీఈఓగా పదోన్నతి పొందిన మేన శ్రీను హనుమకొండ జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా కొంతకాలం ఉమ్మడి వరంగల్ జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా సేవలందించారు. 2020లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి (సీఈవో)గా పదోన్నతి పొందిన ఆయన అదే హోదాలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ గా విశిష్ట సేవలందించారు. 2024 నవంబర్ 22 న హనుమకొండ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు చేపట్టిన మేన శ్రీను సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సెర్ప్ సీఈఓ దివ్య గారల నుంచి ప్రశంసలు పొందారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పలు అవార్డులను సైతం సొంతం చేసుకున్నారు.

## నిరంతర శ్రమకు ప్రతీక..

నిరాడంబరత, నిరంతర శ్రమకు ప్రతీక మేన శ్రీను. జిల్లా అధికారిననే భావన లేకుండా ప్రజా సంబంధాలను ఆయన కొనసాగిస్తున్నారు. ఏ హోదాలో ఉన్నా తాను ప్రజల సేవకుడిని అనే భావనతో ముందుకు వెళ్తున్నారు. ముఖ్యంగా ఏటూరునాగారం ఏజెన్సీ ప్రాంతంలో ఎంపీడీవోగా పని చేసిన సమయంలో ద్విచక్ర వాహనంపైనే అన్ని గ్రామాలు తిరిగేవారు. ప్రతి గ్రామంలో మహిళా పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి మహిళా సాధికారతకు కృషి చేశారు. నీరు–మీరు.. కుటుంబ నియంత్రణ, అక్షర సంక్రాంతి, మిషన్ కాకతీయ, జన్మభూమి తదితర కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు నిరుద్యోగ యువతను అన్ని విధాల ప్రోత్సహించారు. 2004, 2006 లో జరిగిన మేడారం జాతరతో పాటు, గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. సామాజిక రుగ్మతల నివారణకు కృషి చేస్తూనే, అటవీ గ్రామాల అభివృద్ధికి నిరంతరం పాటుపడ్డారు. ఎకనామికల్ సపోర్ట్ స్కీం ద్వారా గిరిజనులకు చేయూతను అందించారు. గోదావరి వరదలు రామన్నగూడెంతో పాటు చుట్టుపక్కల గ్రామాలను ముంచెత్తినప్పుడు ప్రాణ నష్టం జరగకుండా సేవలందించారు. హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిగా.. ముస్లిం, మైనార్టీల సమగ్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారు. ముస్లింల కోసం మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేయించిన ఆయన విదేశీ చదువుల కోసం వెళ్లే విద్యార్థులకు చేయూతనందించారు.




హనుమకొండ జిల్లాలో ఉన్న ఏడు ముస్లిం పాఠశాలల్లో కనీస వసతి సౌకర్యాలు కల్పించారు. హనుమకొండ జిల్లాలో ఉర్దూ భవన్ ఏర్పాటు కోసం న్యూ శాయంపేటలో 2000 చదరపు గజాల స్థలాన్ని ఇప్పించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో సకల హంగులతో షాదీ ఖానాను నిర్మించడంలో ప్రధాన భూమిక పోషించారు. వరంగల్ దేశాయిపేట రోడ్డులో ముస్లిం మహిళల కోసం మైనార్టీ కళాశాల ఏర్పాటులో మేన శ్రీను కీలకంగా వ్యవహరించారు.


గడ్డం కేశవమూర్తి
Cell:9390101862

## గ్రామీణ వికాసానికి విశేష కృషి..

గ్రామీణ వికాసానికి హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి మేన శ్రీను విశేష కృషి చేస్తున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 54 వేలమంది కూలీలకు 8.21లక్షల పని దినాలు కల్పించి రూ. 20,78,82,000 వేతనంగా చెల్లించారు. అదేవిధంగా రూ.11.734 కోట్ల గ్రామాల్లో రోడ్లు, పశువుల పాకలు, ఇతర సామాగ్రిని పంపిణీ చేసి లబ్ధిదారులకు అందజేశారు. వన మహోత్సవంలో భాగంగా ఈ ఏడాది 8.84 లక్షల గృహూపకరణ మొక్కలను, 65,089 పండ్ల మొక్కలను నాటించారు. ప్రతి నెల 1,01,706 మంది లబ్ధిదారులకు రూ.24,32,10,416 ఆసరా పెన్షన్ల రూపంలో అందజేస్తున్నారు. వయోవృద్ధులు, వితంతువులు, వికలాంగులు, నేత, గీత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తూ వారికి ఆర్థిక పరిపుష్టిని కల్పిస్తున్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రజా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రాజెక్టు అధికారి మేన శ్రీను సెల్ఫ్ హెల్ప్ గ్రూపులను బలోపేతం చేస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం జిల్లాలో 3,533 మంది డ్వాక్రా మహిళలకు రూ.320.66 కోట్లు స్త్రీ నిధి పథకం కింద రుణంగా ఇప్పించారు. అదేవిధంగా జిల్లాలో 11,336 సెల్ఫ్ హెల్ప్ గ్రూపులను ఏర్పాటు చేసి అందులో 1,11,400 మంది మహిళలను సభ్యులుగా చేర్పించారు. అలాగే 191 వికలాంగుల సంక్షేమ సంఘాలు, 104 వయోవృద్ధుల సంఘాలను కూడా ఏర్పాటు చేసి వారికి చేయూతనందిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు హనుమకొండ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి మేన శ్రీను విశేష కృషి చేస్తున్నారు.



వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, నవంబర్ 04, 2025

# ఓరుగల్లులో భారీ వర్షం

- అకాల వర్షంతో తడిసిపోయిన పత్తి, వరిధాన్యం
- జలమయమైన కాలనీలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములతో వర్షాలు దంచికొట్టాయి. మంగళవారం ఉదయం నుంచి కుండపోత వానలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. వరంగల్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వర్షానికి నగర రహదారులు చెరువులను తలపించాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఎనుమాముల మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న తడిసిపోయింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 'మొంథా' తుపాను ముంపు నుంచి ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలు పూర్తిగా తేరుకోలేదు. మరోసారి వర్షాలు కురవడంతో లోతట్టుప్రాంత ప్రజల్లో ముంపు భయం నెలకొంది. అదే విధంగా రానున్న 24 గంటల్లో మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్, జనగాం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తోపాటు స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులతో కలిసి జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 11వ డివిజన్ పోతన నగర్‌లో క్షేత్ర స్థాయి పర్యటించారు. నాళాల భౌతిక స్థితి పరిశీలించి, వరద నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల సూచించారు. రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లిడిరచింది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్, నల్లగొండతోపాటు పలు జిల్లాల్లో భారీ వాన కురుస్తున్నది. అరేబియా సముద్రం నుంచి తెలంగాణ వైపు తేమ గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం నుంచి పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

### మార్కెట్ అధికారుల నిర్లక్ష్యం?

నాలుగు రోజుల క్రితమే వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించినా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని దీంతో మార్కెట్ కు తెచ్చిన వందలాది పత్తి పర్షార్పనం అయ్యాయని రైతులు ఆరోపించారు. మార్కెట్ యార్డు అధికారులు రైతులకు సకాలంలో తాటిపత్రిల్లు అందించలేకపోయారన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన ఈ నష్టాన్ని ప్రభుత్వమే భరించాలని రైతులు డిమాండ్ చేశారు. మార్కెటింగ్ శాఖ ద్వారా పత్తి కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. మార్కెట్ కు తీసుకు వచ్చిన తర్వాత సరుకులు కాంటాలు వేయకపోవడం వెంట వెంటనే కార్యక్రమాలు పూర్తి చేయకపోవడం వల్ల మార్కెట్ లో సరుకులు వానకు తడిసి ఎండకు ఎండి పాడవుతున్నాయని రైతులు ఆరోపించారు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకొని రైతు తెచ్చిన పంటను భద్రపరిచే విధంగా కాంటాలయ్యేవరకు కూడా బాధ్యత వహించాలని మార్కెట్ కు వచ్చినాక మార్కెట్ బాధ్యత వహించాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఆరుకాలం కష్టించి ఎండకు వానకు వాతావరణాన్ని కోర్చి మార్కెట్ కు తీసుకువచ్చినాక ఈ రకమైన నష్టాన్ని రైతులకు కలిగించడం ఎంతవరకు సమంజసం అని రైతులు ఆవేదన చెందుతున్నారు.










- 365 ఒత్తులతో దీపారాధన
- పవిత్రతకు మారు పేరు కార్తీక మాసం

**వరంగల్ వాయిస్, ఆధ్యాత్మికం :** కార్తీక మాసం ప్రతీ రోజూ శుభప్రదమైనదే. ఒక్కో రోజుకు ఒక్కో విశిష్టత ఉంది. ముఖ్యంగా కార్తీక పౌర్ణమి, కార్తీక ఏకాదశి, ద్వాదశి, సోమవారాలు మరింత పవిత్రంగా భావిస్తారు. ఈ రోజుల్లో చేసే పూజలు, ఆచరించే ఉపవాసాలు ఇంకా పవిత్రమైనవిగా విశ్వసిస్తారు. ముఖ్యంగా కార్తీక పౌర్ణమిని అత్యంత విశిష్టమైదిగా భావిస్తారు. ప్రత్యేక పూజలు, నోములు ఆచరిస్తారు. ఈ రోజున ఉదయాన్నే నదులు, కాలువలు, బావి వద్ద లేదా ఇంట్లోనే చన్నీటి స్నానం చేసి తులసి కోటవద్ద నేతిదీపాలు వెలిగిస్తారు. కొందరు ఉసిరి దీపాలు వెలిగిస్తారు. భోళాశంకరుడిని, శ్రీమహావిష్ణువుని భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. చాలా మంది కార్తీక పురాణం చదువుతారు.

### శంభో శంకర..

ఈ కార్తీక మాసం అంతా హర హర మహాదేవ శంభో శంకర అంటూ పరమేశ్వరుడి నామస్మరణతో మారుమోగుతుంటాయి. కార్తీక పౌర్ణమి రోజున 365 ఒత్తులతో దీపారాధన చేసి పరమేశ్వరుడిని కొలిచి భక్తిపారవశ్యంలో మునిగిపోతారు. అలాగే అరటి దొప్పల్లో కార్తీక దీపాలను వెలగించి.. ఆ దీపాలను పున్నమి వెలుగుల్లో నదిలో వదిలి తరించిపోతారు. రుద్రాభిషేకాలు, రుద్రపూజ, లక్ష బిల్వదళ పూజలు, లక్షపత్రి పూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఇలా ప్రత్యేకపూజలు, వ్రతాలతో ప్రముఖ ఆలయాలన్నీ కిటకిటలాడతాయి.

### పూజా కార్యక్రమాలు..

హిందూ పంచాంగం ప్రకారం ఈ ఏడాది కార్తీక పౌర్ణమి తిథి నవంబర్ 4 వ తేదీ రాత్రి 10.30 గంటలకు ప్రారంభమవుతుంది. అనంతరం నవంబర్ 5వ తేదీ సాయంత్రం ముగుస్తుంది. నవంబర్ 5వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం 6.48 గంటల వరకు పౌర్ణమి ఉంటుంది. అంటే ఈ ఏడాది పౌర్ణమి ఘడియల్లోనే సూర్యోదయం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఉదయ తిథి ప్రకారం నవంబర్ 5వ తేదీన కార్తీక పౌర్ణమి జరుపుకోవాలని పండితులు సూచిస్తున్నారు. దీపారాధన చేయడానికి సాయంత్రం 5.15 గంటల నుంచి 7.05 గంటల వరకు అనుకూలంగా ఉంటుందని పండితులు చెబుతున్నారు.

# రోడ్ల మరమ్మతులు చేపట్టండి

- పంటల నష్టం వివరాలను త్వరగా నమోదు చేయాలి
- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం గ్రామాలలో దెబ్బతిన్న పంటలు, రోడ్లను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం పరిశీలించారు. వరి, పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలకు పరిహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించే వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు త్వరగా నమోదు చేసి నివేదికను అందజేయాలన్నారు. ధర్మసాగర్ దేవునూరు ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు, వంతెన, వరి పంటలు దెబ్బతినగా కలెక్టర్ అర కిలోమీటరు మేర నడుచుకుంటూ వెళ్లి అధికారులు, స్థానికులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్ల మరమ్మతు పనుల గురించి పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. అదేవిధంగా గ్రామంలో వేసిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు ఎంత మేరకు నష్టం జరిగిందని వివరాలను వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులకు చెందిన పంట పొలాలు నీట మునిగి దెబ్బతిన్న వరి పంటను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించి జరిగిన పంటల నష్టం గురించిన వివరాలను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ లో దెబ్బతిన్న పంటల వివరాల నమోదు చేస్తున్న సమాచారాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను సర్వే నంబర్లు, రైతుల వారీగా వివరాలను నమోదు చేయాలన్నారు. వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారానికి నివేదిక అందించాల్సి ఉండగా వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం అంచనా వివరాలను త్వరగా అందజేయాలన్నారు. అక్కడినుంచి ముప్పారం గ్రామానికి చేరుకొని గ్రామంలో దెబ్బతిన్న పంటలు, రోడ్లను పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులు కలెక్టర్ కు వివరించారు. వరదలతో పశు సంపదకు జరిగిన నష్టం గురించిన వివరాలను కలెక్టర్ కు తెలియజేశారు. వరద తాకిడికి సుమారు 450 క్వింటాళ్ల వరి ధాన్యం కొట్టుకుపోయిన వివరాలను తెలియజేశారు. స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడి వరి, పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలకు జరిగిన నష్టం గురించి తెలుసుకున్నారు. స్థానిక చెరువు నుంచి వచ్చిన వరద నీటితో దెబ్బతిన్న రోడ్లను, పంట నష్టాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు వెంటనే ప్రారంభించాలని, అందుకు సంబంధించిన ప్రతిపాదిత అంచనాల నివేదికను అందజేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అదేవిధంగా ధర్మసాగర్ రిజర్వాయర్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్ కు ఎంత ఇన్ ఫ్లో వస్తుందని, రిజర్వాయర్ కెపాసిటీ, అవుట్ ఫ్లో గురించి నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గత నెల 29వ తేదీన రిజర్వాయర్ లో ఉన్న నీటి సామర్థ్యం, ఇతర వివరాలను కలెక్టర్ కు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, డీఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ మంగీలాల్, ధర్మసాగర్ తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, ఏవో రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com